
త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి మ్యాప్‌ను పోలీస్ కమిషనర్ అనురాధకు వివరిస్తున్న అధికారులు

సమన్వయంతో విధులు నిర్వహించాలి

- క్రైమ్ రేట్ తగ్గించేలా చూడాలి
- గ్రామాలను పర్యటించి సమస్యలు తెలుసుకోవాలి
- పోలీస్ కమిషనర్ అనురాధ

సిద్దిపేట అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని, క్రైమ్ రేట్‌ను తగ్గించేలా చూడాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ సూచించారు. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల పరిధిలో త్రీటౌన్, సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌ను, పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌ను, నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ పెట్రోల్ పంపును శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చుట్టూ మరిన్ని మొక్కలను నాటాలన్నారు. త్వరలోనే పోలీస్ పెట్రోల్ పంపును ప్రారంభిస్తామని తెలిపారు. స్టేషన్‌కు వచ్చిన వారితో మర్యాదగా ప్రవర్తించాలని ఆదేశించారు. కేసులను త్వరగా ఛేదించేలా చూడాలని సిబ్బందికి సూచించారు. పరిసరాలను పరిశీలించి పచ్చదనంగా ఉన్నాయని త్రీటౌన్ సీఐ విద్యాసాగర్‌ను, సిబ్బందిని అభినందించారు. గ్రామాలకు కేటాయించిన సిబ్బంది వారానికి రెండు, మూడు సార్లు గ్రామాలను పర్యటించి సమస్యలు తెలుసుకోవాలని ఆదేశించారు. ఆమె వెంట సిద్దిపేట ఏసీపీ మధు, సీసీఎస్ ఏసీపీ యాదగిరి, త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు విష్ణుప్రసాద్, పూర్ణచందర్, త్రీటౌన్, సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌ల సిబ్బంది ఉన్నారు.

వసతికి సుస్తీ

సమస్యల వలయంలో గజ్వేల్ ఎస్టీ హాస్టల్
డోర్లు లేని మరుగుదొడ్లు, పాడైన ఫ్యాన్లు, లైట్లు, తాగునీటికీ తండ్లాటే
పెచ్చులూడుతున్న భవనం 8

ఆదివాసీల హక్కుల కోసం పోరాడుదాం

నోరెత్తితే అర్బన్ నక్సలైట్లుగా ముద్ర
గిరిజనులు, ఆదివాసీలపై బీజేపీ కక్ష
ఆపరేషన్ కంగార్ పేరుతో ఊచకోత 7
పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్

ఎస్సీ వర్గీకరణ ఉద్యమ 8
అమరులకు నివాళి


ఇంద్రుడి పాత్రలో గిరిబాబు

రంగస్థల 'గిరి'రాజు 7

ప్రభుత్వ ఉద్యోగులు చాలామంది సెలవు దొరికితే కుటుంబ సభ్యులతో సరదాగా గడుపుతూ కాలక్షేపం చేస్తుంటారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం సిద్ధన్నపేట గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మాత్రం తనకు ఇష్టమైన నటనతో నాటక కళకు ఊపిరులూదుతున్నాడు. కొమురవెల్లి మండలం గురువన్నపేట ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న దేవులపల్లి గిరిబాబు ఓవైపు టీచర్‌గా బాధ్యతతో విధులను నిర్వహిస్తూనే రంగస్థలంపై నవరసాలు పలికిస్తున్నాడు. సామాజిక ఇతివృత్తాలతో కూడిన నాటకాలలో నటిస్తూ సమాజాన్ని చైతన్య పరచడంలో తనవంతుగా కృషి చేస్తున్నారు.

వందకుపైగా నాటక ప్రదర్శనలిచ్చిన టీచర్
వెండితెర, బుల్లితెరపై రాణిస్తున్న ఉత్తమ ఉపాధ్యాయుడు
ఉత్తమ జ్యూరీ అవార్డుతో గుర్తింపు
డాక్యుమెంటరీ, షార్ట్‌ఫిల్మ్‌లతో ప్రతిభ

-నంగునూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి)


విద్యుత్ దీపాల వెలుగులో సిద్దిపేట పట్టణంలోని సుఫియా మసీద్

రంజాన్ వేళలు
ఆదివారం ఇఫ్తార్: సాయంత్రం 6.28
సోమవారం సహర్: ఉదయం 5.11

శుభాల మాసం రంజాన్ 7లో

వేసవి తొలినాళ్లలోనే జిల్లాలో సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. భూగర్భ జలాలు అడుగంటడంతోపాటు గోదావరి నీటి ఎత్తిపోతను నిలిపివేయడమే అందుకు కారణాలుగా కనిపిస్తున్నాయి. మరో 20 రోజులు గడిస్తే వరి పంటలు కోతకు వస్తాయి. ఈ దశలో పొలాలకు నీటి తడి అవసరం. కానీ రంగనాయక సాగర్‌లో నిల్వ ఉన్న జలాలు అందుకు సరిపోవు. మరో 2 టీఎంసీలు ఎత్తిపోస్తేనే వరి పంటలు చేతికందుతాయి.


చేర్యాల పశువుల మేతగా మారిన వరి చేను

అడుగంటుతున్న ఆశలు

జిల్లాలో పడిపోతున్న భూగర్భజలాలు

వేసవి తొలినాళ్లలోనే సాగునీటి కష్టాలు
బోర్లు, బావుల్లో అంతంతమాత్రమే ఊట
నీరందక ఎండిపోతున్న పంటపొలాలు
గోదావరి జలాలను ఎత్తిపోస్తేనే ఊరట
మంత్రి ఉత్తమ్‌కు లేఖ రాసి ఫోన్ చేసిన హరీశ్‌రావు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, మార్చి 1 : నాలుగేళ్ల నుంచి సమృద్ధిగా ఉంటున్న భూగర్భజలాలు ఈసారి పాతాళానికి పడిపోతున్నాయి. గతేడాది ఇదే సమయంలో జిల్లాలో సగటున 10.07 మీటర్ల లోతున ఉన్న భూగర్భజలాలు ప్రస్తుతం 12.13 మీటర్ల అడుగులోకి చేరాయి. వేసవి ఆరంభంలోనే ఈ పరిస్థితి ఉంటే ఏప్రిల్, మే నెలల్లో ఇంకెలాంటి దుస్థితి ఏర్పడుతుందోననే ఆందోళన వ్యక్తమవుతుంది. గతేడాది మే నెలలో 12.15 మీటర్ల లోతున భూగర్భజలాలు ఉండగా మూడు నెలల ముందుగానే జిల్లాలో ఆ పరిస్థితి నెలకొన్నది. ఫిబ్రవరి మూడో వారం నుంచి ఎండలు ప్రారంభం కావడంతోనే భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. ఈ పరిస్థితిని అధిగమించాలంటే రిజర్వాయర్ల ద్వారా నీటిని చెరువులు, చెక్‌డ్యాములు, కుంటలు, వాగుల్లోకి తరలించాలి. ఇలా చేయడం వల్ల కొంతవరకైనా భూగర్భజలాల స్థాయిని పెంచే ఆస్కారం ఉంటుంది.

ఉత్తమ్‌కు ఫోన్‌చేసిన హరీశ్‌రావు.

రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు ఇటీవల లేఖ రాశారు. ఎస్సారెస్పీ నీటిని విడుదల చేసి మిడ్‌మానేరు ద్వారా రంగనాయకసాగర్‌లోకి గోదావరి జలాలు ఎత్తిపోయాలని కోరారు. కానీ లేఖకు స్పందన రాలేదు. జిల్లాలో పరిస్థితి విషమిస్తున్న

మిగతా 8వ పేజీలో


సిద్దిపేట రూరల్ మండలం సీతారాంపల్లిలో ఎండిపోయిన పొలం


నీళ్లు లేక అడుగంటిన అంకంపేట చెరువు


కొమురవెల్లి మండలం గురువన్నపేటలో ట్యాంకర్ ద్వారా నీటిని పడుతున్న రైతు

రైతుల భగీరథ యత్నం.. దిక్కుతోచక పశుగ్రాసానికి..

చేర్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలంలో 11,200 ఎకరాలలో, కొమురవెల్లి మండలంలో 11 వేల ఎకరాలలో రైతులు వరి సాగు చేశారు. తమకు అందుబాటులో ఉన్న బోరు నీటి వనరుల ద్వారా నాట్లు వేయగా ఆశించిన మేర ఎదిగాయి. ముందస్తుగా విత్తనాలు వేసిన రైతుల పొలాలు కర్రలు పెట్టి పొట్ట దశకు చేరుకోగా, ఆలస్యంగా వేసిన చేలు ఇప్పుడిప్పుడే కర్రలు పెడుతున్నాయి. ప్రస్తుతం రెండు దశలలో ఉన్న పొలాలకు నీటి తడులు పారించడం కష్టంగా మారింది. భూగర్భజలాలు అడుగంటడంతో బోర్లలో నుంచి నీరు రాక మడులు తడికి నోచుకోవడం లేదు. దీంతో చేలు ఎండుముఖం పడుతూ బీటలు బారుతున్నాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు భగీరథ యత్నం చేస్తున్నారు. ట్యాంకర్ల నీటిని కొనుగోలు చేసి చేనును తడుపుతున్నారు. గంగమ్మ జాడ కోసం మరికొంత మంది బోర్లు వేస్తున్నారు. కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామ తలాపునే తపాస్‌పల్లి రిజర్వాయర్ ఉంది. కానీ ఇతర గ్రామాల మాదిరిగా నీటిని మళ్లించే కాలువ నిర్మాణం లేకపోవడంతో చెరువులపై ఆధారపడి పంటలు సాగుచేసుకుంటున్నారు. కానీ ప్రస్తుత

మిగతా 8వ పేజీలో

నామినేటెడ్ పోస్టులను అమ్ముకుంటున్నారు

ఆధారాలతో నిరూపించడానికి సిద్ధం

నర్సారెడ్డిని గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి నుంచి తొలగించాలి
టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి డిమాండ్

గజ్వేల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : నామినేటెడ్ పోస్టులను అమ్ముకుంటున్నారని, ఎవరి వద్ద ఎన్ని డబ్బులు వసూలు చేశారో నిరూపించడానికి సిద్ధంగా ఉన్నామని టీపీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి అన్నారు. దమ్ముంటే ఇందిరాపార్కు వద్ద చర్చలకు రావాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ పార్టీ పలు మండలాల అధ్యక్షులతో కలిసి శనివారం ఆయన గజ్వేల్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తాను చెప్పిన వారికి పదవులు ఇస్తే ఆరు మండలాలను గెలిపిస్తామని అంటున్నారని, అవి కూడా అమ్ముకుంటారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి నుంచి నర్సారెడ్డిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఆయన చేసిన అక్రమాలను త్వరలోనే టీపీసీసీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను కలిసి వివరిస్తామని చెప్పారు. డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ఆయన ఫోన్‌లు బంద్ చేసుకుని పారిపోయాడని మండిపడ్డారు. డీసీసీ అధ్యక్ష పదవి నుంచి నర్సారెడ్డిని తొలగిస్తామని అంటే, అప్పటి పీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి వద్దకు తామంతా వెళ్లి వద్దని కోరామని తెలిపారు. నర్సారెడ్డి 2014లో బీఆర్ఎస్ పార్టీకి అమ్ముడుపోయారని, 2023లో బీజేపీకి అమ్ముడుపోయారని ఆరోపించారు. తాము పార్టీని బతికించుకోవడం కోసం 2014లో ఆస్తులు అమ్ముకుని


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేశామన్నారు. ఏళ్లుగా పార్టీ కోసం పనిచేశామని, అధికారంలోకి వచ్చాక తమపైనే కేసులు పెట్టించడంతో పాటు దాడులకు దిగుతున్నారని మండిపడ్డారు. 'నర్సారెడ్డి గారూ... పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిపై కక్ష సాధింపు చర్యలు వద్దు' అని కోరారు. మైనంపల్లి హనుమంతరావు వస్తే వెళ్లవద్దని చెబుతున్నారన్నారు. మైనంపల్లికి జిల్లా వ్యాప్తంగా కేడర్ ఉందని, ఆయన కనుసన్నలలోనే పార్టీని బలోపేతం చేస్తామన్నారు. ఈ సమావేశంలో పట్టణాధ్యక్షుడు మోహన్నగారి రాజు, గజ్వేల్, మనోహరాబాద్, ములుగు మండలాధ్యక్షులు మల్లారెడ్డి, గంగిశెట్టి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెట్లపల్లి అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొట్లపల్లి రాజన్న ఆలయ హుండీ ఆదాయం రూ.37,63,669

హుస్నాబాద్ రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి జాతర సందర్భంగా పొట్లపల్లి స్వయంభూ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో వచ్చిన హుండీ ఆదాయాన్ని లెక్కించారు. శనివారం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ ఈవో కిషన్‌రావు నేతృత్వంలో చేపట్టారు. హుండీలో రూ.5,55,069, టికెట్ల అమ్మకంతో రూ.4,01,600 బహిరంగ వేలం ద్వారా రూ.28,07,000 ఆదాయం వచ్చింది. జాతర సందర్భంగా మొత్తంగా రూ.37,63,669 ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు. గతేడాది రూ.36,66,920 ఆదాయం సమకూరగా, ఈ ఏడాది రూ.96,749 ఆదాయం పెరిగినట్లు కిషన్‌రావు పేర్కొన్నారు.


దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో లెక్కిస్తున్న హుండీ

చేర్యాల మున్సిఫ్ కోర్టు
న్యాయాధికారిగా కృష్ణతేజ

చేర్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణంలోని మున్సిఫ్‌కోర్టులో ఇక నుంచి ప్రతీ గురువారం సేవలు అందనున్నాయి. జనవరి 11వ తేదీన మున్సిఫ్ కోర్టును ప్రారంభించి సిద్దిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రావణియాదవ్‌కు అదనపు బాధ్యతలను అప్పగించడంతో ప్రతీ శుక్రవారం కార్యకలాపాలను కొనసాగించారు. ప్రస్తుతం ఆమె శిక్షణ సెలవులపై వెళ్లడంతో హుస్నాబాద్ ఫస్ట్ క్లాస్ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ.కృష్ణతేజకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. శనివారం ఆయన కోర్టు రికార్డులలో సంతకాలు చేసి బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఇటీవల నమోదైన డ్రంకెన్ డ్రైవ్ కేసులను పరిశీలించారు. ముగ్గురికి రూ.5వేలు, నలుగురికి రూ.1500 చొప్పున, 15 మందికి వేయి రూపాయలు చొప్పున జరిమానా విధించారు. అలాగే పేకాట కేసులు నమోదైన వారిని విచారించి ఏడుగురికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

సిద్దిపేట కలెక్టరేట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాను డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దాలని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. కలెక్టరేట్‌లో కాన్ఫరెన్స్‌హాల్‌లో రోడ్డుభద్రత కమిటీ, మత్తు పదార్థాల నివారణకు సంబంధించి అన్ని శాఖల అధికారులతో శనివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డ్రగ్స్ సరఫరా, వినియోగాన్ని అంతం చేయాలన్నారు. ఎక్కడి నుంచి రవాణా అవుతుందో నిఘా పెట్టాలని పోలీస్ అధికారులకు తెలిపారు. సోషల్ మీడియాలో డ్రగ్స్ అవేర్నెస్ వీడియోలు, ఫొటోలతో ప్రచారం చేయాలని సూచించారు. విద్యా సంస్థలలో డ్రగ్స్ వంటి మత్తుపదార్థాల వినియోగంపై అవగాహన సదస్సులను నిర్వహించాలన్నారు. విద్యాసంస్థల వద్ద డ్రాపౌట్ విద్యార్థులు, ఇతరులు డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ బస్సుల్లో డ్రగ్స్ రవాణా జరగకుండా గుర్తించే చర్యల గూర్చి కండక్టర్, డ్రైవర్‌లకు సైతం పోలీస్ అధికారులు శిక్షణ ఇవ్వాలని తెలిపారు. రాజీవ్ రహదారుల వెంబడి అనధికారిక డివైడర్ కటింగ్‌లను మూసివేయాలని, ఇతర గ్రామాల నుంచి రహదారి కలిసే ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు వేయాలన్నారు. రోడ్డుకు ఇరువైపుల ఎల్లపుడూ పచ్చగా ఉండేలా చేయాలని మొక్కలను పెంచాలని హెచ్‌కేఆర్ అధికారులను ఆదేశించారు. రహదారుల వెంబడి డ్రంకెన్ డ్రైవ్ టెస్టులను తరచూ నిర్వహించాలన్నారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్

విద్యార్థి దశ చాలా కీలకం : ఎస్ఐ

చేర్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ వ్యక్తికి విద్యార్థి దశ చాలా కీలకమని కొమురవెల్లి ఎస్ఐ రాజు అన్నారు. కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల జడ్పీఎస్ఎస్‌లో శనివారం సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, మహిళా రక్షణ చట్టాలు, డ్రగ్స్ వినియోగం వలన కలిగే అనర్థాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలి

రాయపోల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం మంతూరు గ్రామంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు పర్వేజ్ కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా విద్యుత్ శాఖ అధికారి చంద్రమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

క్రైం కార్నర్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ మహేష్‌కుమార్, పోలీసులు

వీడిన మహిళ హత్య కేసు మిస్టరీ

- ఆమెతో వివాహేతర సంబంధం
- కుమార్తెను పెళ్లి చేసుకుంటానని ప్రతిపాదన
- నీ వ్యవహారం బయటపెడుతానంటూ ఆమె ఆగ్రహం
- కొట్టి.. ఉరి వేసి హత్య.. రోల్‌గోల్డ్ నగలు ఎత్తుకుని పరారీ

సదాశివపేట, మార్చి 1: (ఆంధ్రజ్యోతి): ఆమెతో వివాహేతర సంబంధం నడుపుతున్నాడు. ఇద్దరూ ఏకాంతంగా ఉన్న సమయంలో 'నీ కుమార్తె భర్త చనిపోయాడు కదా.. ఆమెను నేనే పెళ్లి చేసుకుంటా' అని ప్రతిపాదన పెట్టాడు. తనతో సంబంధం నడపడమే కాకుండా తన కుమార్తెపై కూడా కన్నేశాడని ఆమె ఆగ్రహం వ్యక్తం చేసింది. తెల్లవారిన తర్వాత గ్రామస్థులకు చెప్పి నీ అంతు చూస్తానని హెచ్చరించింది. అదే జరిగితే తన బండారం బయటపడుతుందని భావించిన అతడు ఆమె తలపై బండరాయితో మోది.. చీరతో ఉరి వేసి చంపేశాడు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండల కేంద్రంలో గత నెల 27న జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఆమెతో వివాహేత సంబంధం పెట్టుకున్న వ్యక్తే చంపేశాడని తేల్చారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఐ మహేష్‌కుమార్‌గౌడ్ వివరాలు వెల్లడించారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ(39)కి అదే గ్రామానికి చెందిన చెల్మెడ భాస్కర్ (45)తో రెండేళ్లుగా వివాహేతర సంబంధం ఉంది. ఆమె గత నెల 27న రాత్రి 10 గంటల సమయంలో సదాశివపేట పట్టణానికి వచ్చింది. అప్పటికే మద్యం సేవించి ఉన్న ఆమె అదే రోజు రాత్రి 12 గంటల సమయంలో కాలినడకన ఇంటికి వెళ్తూ మార్గమధ్యంలో భాస్కర్ కంటపడింది. మాట కలిపిన భాస్కర్ ఆమెను మండల పరిషత్ కార్యాలయం వెనుకకు తీసుకెళ్లాడు. అక్కడ ఇద్దరూ కలిసి అర్ధరాత్రి 2 గంటల వరకు ఏకాంతంగా గడిపారు. ఈ సమయంలో భాస్కర్ నీ కుమార్తె భర్త చనిపోయాడు కదా.. ఆమెను నేనే పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. అప్పటికే మూడు పెళ్లిళ్లు చేసుకున్న భాస్కర్ తన కుమార్తెపై కన్నేయడాన్ని ఆమె జీర్ణించుకోలేకపోయింది. మనసులో ఇంత నీచభావం పెట్టుకున్నావా అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తెల్లవారిన తర్వాత గ్రామంలో నీ నిజ స్వరూపాన్ని బయటపెట్టి, పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టించి.. నీ అంతు చూస్తానని బెదిరించింది. అదే జరిగితే తన బండారం పడుతుందని భావించిన నిందితుడు ఆమె తలపై బండరాయితో మోదాడు. ఆమె అవరడంతో నోట్లో చీర కొంగు కుక్కాడు. అంతటితో ఆగకుండా మరోసారి రాయితో కొట్టి, ఛాతీపై పిడిగుద్దులు గుద్దాడు. గొంతు నొక్కి చీరతో ఉరి వేశాడు. అనంతరం ఆమె ఒంటిపై ఉన్న రోల్డ్ గోల్డ్ చైన్, చెవిదుద్దులు, రూ. రెండు వేల నగదు, కాలి పట్టాగొలుసులు తీసుకుని పరారయ్యాడు. ఉదయం మృతదేహాన్ని చూసి స్థానికులు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. అనుమానంతో శనివారం నిందితుడు భాస్కర్‌ను అరెస్ట్ చేయగా, విషయం బయటపడింది. దీంతో నిందితుడిని రిమాండ్‌కు పంపించారు.

మంజీరా నదిలో మునిగి ఇద్దరి మృతి


శ్యాంకుమార్, కృష్ణ (ఫైల్)

కొల్చారం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఏడుపాయల వనదుర్గా మాత జాతరకు వచ్చిన ఇద్దరు యువకులు మంజీరా నదిలో మునిగి మృతిచెందారు. మెదక్ జిల్లా కొల్చారం మండల కేంద్రం పరిధిలో శనివారం సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు, మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ ఇందిరానగర్ కాలనీకి చెందిన నిస్నేకర్ కృష్ణ (20), ఆసిఫ్‌నగర్‌కు చెందిన మిల్కీకర్ శ్యాంకుమార్ (21) కుటుంబసభ్యులతో కలిసి మూడు రోజుల క్రితం ఏడుపాయల జాతరకు వచ్చారు. జాతర ముగియడంతో శనివారం ఇంటికి వెళ్లే క్రమంలో పోతన్‌శెట్‌పల్లి శివారులో మంజీరా నది రెండో బ్రిడ్జి వద్ద నదిలో స్నానానికి దిగారు. లోతు ఎక్కువగా ఉండడంతో నీటిలో గల్లంతయ్యారు. కుటుంబ సభ్యులు కాపాడేందుకు ప్రయత్నించినా అప్పటికే మునిగిపోయారు. పక్కనే జాతర విధుల్లో ఉన్న గజ ఈతగాళ్ల నీటిలో గాలించి మృతదేహాలను బయటకు తీసుకువచ్చారు. మృతుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

హాస్టల్‌లో ఉండి చదువుకోవడం ఇష్టం లేక..



వైష్ణవి (ఫైల్)

నర్సాపూర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో ఉండి చదువుకోవడం ఇష్టం లేక ఓ ఇంటర్ విద్యార్థిని ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మెదక్ జిల్లా నర్సాపూర్ శ్రీరాంనగర్‌లో శనివారం జరిగింది. ఎస్సై లింగం కథనం ప్రకారం.. హన్మకొండకు చెందిన కృష్ణకుమార్ నర్సాపూర్ గిరిజన గురుకులంలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. భార్య సునీత, పిల్లలతో నర్సాపూర్‌లో ఉంటున్నాడు. వారి పెద్ద కుమార్తె వైష్ణవి(16) హైదరాబాద్ నాగోల్ సమీపంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ బైపీసీ మొదటి సంవత్సరం చదువుతోంది. హాస్టల్‌లో ఉండి చదువుకోవడం ఇష్టంలేక తరచూ ఇంటికి వచ్చేది. తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు ఆమెకు నచ్చజెప్పి.. హాస్టల్‌కు పంపించేవారు. ఇలాగే, నెల క్రితం ఇంటికి వచ్చింది. ఈ నెల 5 నుంచి పరీక్షలు ఉండటంతో ఆదివారం తిరిగి కళాశాలకు తీసుకెళ్లాలను తల్లిదండ్రులు నిర్ణయించారు. హాస్టల్‌కు వెళ్లడం ఇష్టం లేని వైష్ణవి శనివారం సాయంత్రం చదువుకుంటానని చెప్పి, గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుంది. గదిలో నుంచి శబ్దం రావడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా, ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని కనిపించింది. వెంటనే కిందికి దించి నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో వ్యక్తి..

గజ్వేల్ రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గజ్వేల్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గజ్వేల్ పట్టణానికి చెందిన చిగుళ్లపల్లి యాదగిరి కిరాణం, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కొంతకాలంగా రియల్ వ్యాపారం తగ్గి అప్పులపాలయ్యాడు. వీటిని ఎలా తీర్చాలో తెలియక శనివారం ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

భార్యతో గొడవ పడి యువకుడు..


కంటి నాని(ఫైల్)

జోగిపేట, మార్చి1 (ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవ పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన అందోల్ పట్టణంలోచోటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. అందోల్ పట్టణంలోని 6వ వార్డుకు చెందిన కంటి నాని (26) శుక్రవారం రాత్రి భార్యతో గొడవ పడ్డాడు. అదే రాత్రి సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం విషయం తెలుసుకున్న మృతుని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పాండు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు..

గజ్వేల్ రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందిన ఘటన గజ్వేల్‌లోని ఢిల్లీవాలా హోటల్ వద్ద శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మద్దూరు మండలం సలక్‌పూర్ గ్రామానికి చెందిన తరిగోప్పుల లచ్చవ్వ గజ్వేల్‌లోని తన మనవడైన తరిగోప్పుల మహేష్ ఇంట్లో ఉంటుంది. వ్యక్తిగత పని నిమిత్తం గజ్వేల్ పట్టణంలోని ఉమామహేశ్వర కిరాణం నుంచి వెళ్తుండగా పట్టణంలోని ఢిల్లీ వాలా హోటల్ వద్ద గజ్వేల్ పట్టణంలోని బ్రిలియంట్ గ్రామర్ స్కూల్‌కు చెందిన బస్సు ఢీకొట్టగా ఆమె బస్సు చక్రాల కింద పడి మృతి చెందింది. బస్సు డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

శుభాల మాసం రంజాన్

- నేటి నుంచి ఉపవాస దీక్షలు
- వెల్లివిరియనున్న ఆధ్యాత్మిక శోభ
- మసీదులు ముస్తాబు


సిద్దిపేటలో హలీం అమ్మకాలు


పండ్లు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

మెదక్ కల్చరల్/సిద్దిపేట కల్చరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అన్ని మాసాల్లోకెల్లా గొప్పది రంజాన్ మాసమని ముస్లింల నమ్మకం. ముస్లింల పవిత్ర గ్రంథమైన ఖురాన్ ఈ నెలలోనే భూమిపై ఆవిర్భవించిన మాసంగా చెబుతారు. అంతటి శుభాల మాసం వచ్చేసింది. శనివారం నెలవంక కనిపించడంతో రాత్రి ప్రత్యేక ప్రార్థన(దువా) ద్వారా, తరవీ నమాజ్‌తో రంజాన్ సందడి ప్రారంభమైంది. ఆదివారం సహర్‌తో రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం అవుతాయి. 30 రోజుల పాటు ముస్లింలు నిష్ఠగా ఉపవాస దీక్షలు పాటిస్తారు. ప్రత్యేక తరావీ నమాజ్‌లు చదువుతారు.

విద్యుత్ దీపాలతో ముస్తాబు

ఉపవాస దీక్షలు పాటించే ముస్లింలు తప్పనిసరిగా ఐదు పూటలా నమాజ్ చేస్తారు. ప్రత్యేక తరావీ నమాజ్ కూడా ఉంటుంది. రంజాన్ ప్రార్థనల కోసం ఉమ్మడి జిల్లాలోని మసీదు ముస్తామయ్యాయి. ఆయా మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

వెలిసిన హలీం స్టాళ్లు

రంజాన్ మాసం కోసం హోటళ్లలో హలీం తయారు చేస్తున్నారు. హోటళ్లతో పాటు ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేశారు. ముస్లింలే కాకుండా అన్ని వర్గాల వారు హలీం రుచి చేసేందుకు ఇష్టపడుతుండటంతో ఉమ్మడి జిల్లా కేంద్రాలతో పాటు పట్టణాల్లోనూ హలీం దుకాణాలు వెలిశాయి. ఇఫ్తార్ కోసం పండ్ల దుకాణాలూ ఏర్పాటు చేశారు.

ఆధ్యాత్మిక చింతనతో ఉండండి



పవిత్రమైన రంజాన్ మాసం మొత్తం ఆధ్యాత్మిక చింతనతో గడపాలి. దాన ధర్మాలకు రంజాన్ మాసం చక్కటి అవకాశం. వీలైనంతగా అల్లాహ్‌ను స్మరించండి. నమాజులు, జాకాత్ ఇవ్వండి. నెల రోజుల పాటు రోజా పాటించండి.

- ముఫ్తీ కరీముద్దీన్ పటేల్, ఇమామ్ ఫిర్దౌస్ మసీద్, సిద్దిపేట

పేదలకు చేయూతనిద్దాం



రంజాన్ ముస్లింలకు పవిత్రమైన మాసం. ఖురాన్ అవతరించిన మాసం కూడా ఇదే. రంజాన్ సందర్భంగా, ముస్లింలు ఉపవాసం ఉండటమనేది ఇస్లాం ఐదు ప్రాథమిక స్తంభాలలో ఒకటి. ఈ మాసమంతా సేవా దృక్పథంతో ఉండాలి. నిత్యం అల్లా పేరును జపిస్తూ భక్తితో ఉపవాసం కొనసాగించండి. ఆర్థికంగా అవసరమైన పేదవారికి చేయూతనందించి అల్లా ఆశీస్సులు పొందండి.

- ముఫ్తీ ఉబేదుర్ రహమాన్, ఇమామ్, సుఫియా మసీద్, సిద్దిపేట

ఆస్పత్రిలో బాలింత మృతి

కుటుంబ సభ్యుల ఆందోళన- ఆస్పత్రి అద్దాలు.. ఫర్నిచర్ ధ్వంసం, సిబ్బందిపై దాడి



ఆందోళన చేస్తున్న బంధువులు(ఇన్‌సెట్‌లో మానంది ఫైల్)

సంగారెడ్డి అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రక్తస్రావం అవుతుందని చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చిన బాలింత చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో శనివారం జరిగింది. ఆస్పత్రి వర్గాలు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కోహీర్ మండలం మాద్రి గ్రామానికి చెందిన మానంది(24) రెండో కాన్పు కోసం జహీరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరగా సిజేరియన్ కాన్పు ద్వారా ఆడబిడ్డ జన్మించింది. ఈ క్రమంలో బాలింతకు తీవ్రరక్తస్రావం జరుగుతుండడంతో అక్కడి వైద్యులు శుక్రవారం అర్ధరాత్రి హుటాహుటిన సంగారెడ్డికి రెఫర్ చేశారు. ఆస్పత్రిలో చేరిన బాలింతకు తీవ్ర రక్తస్రావం అవుతుండడాన్ని గుర్తించిన డాక్టర్లు సర్జరీ చేసి గర్భసంచిని తొలగించారు. తెల్లవారుజామున బాలింతకు స్ట్రోక్ రావడంతో సీపీఆర్ చేసినా ఫలితం లేకపోవడంతో మృతి చెందిందని డాక్టర్లు నిర్ధారించారు.

కుటుంబ సభ్యుల ఆగ్రహం

డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే బాలింత చనిపోయిందంటూ కుటుంబసభ్యులు, గ్రామస్థులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేశారు. యాజమాన్యాపై వాగ్వాదానికి దిగారు. ఉదయం మృతి చెందితే సాయంత్రం వరకు కూడా స్పందించకపోవడంతో ఆగ్రహంతో కుటుంబసభ్యులు, బంధువులు ఆస్పత్రి అద్దాలు, ఫర్నిచర్, పూలకుండీలు, కంప్యూటర్లు ధ్వంసం చేశారు. సిబ్బందిపై దాడి చేశారు. ఉద్రిక్తత పరిస్థితి నెలకొన్నది. పలువురు పోలీసులు ఉన్నా వారిని కట్టడి చేసేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. బాలింత కుటుంబసభ్యులు సంగారెడ్డి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బాలింత డెడ్‌బాడీని సంగారెడ్డి జీజీహెచ్ మార్చురీకి తరలించారు. బాలింత మృతిపై డాక్టర్ల నిర్లక్ష్యం ఏ మాత్రం లేదని ఆస్పత్రి ఎం.డి. లాలేష్ తెలిపారు.

మహదేవుడిని దర్శించుకున్న ఎంపీ


పటాన్‌చెరు మహదేవుడి ఆలయం వద్ద ఎంపీ రఘునందన్‌రావు

పటాన్‌చెరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు పట్టణంలోని పురాతనమైన మహదేవుడి ఆలయాన్ని ఎంపీ రఘునందన్‌రావు శనివారం సందర్శించారు. శివస్వాముల దీక్షా ఇరుముడి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. సుమారు 8వందల చరిత్ర ఉన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఎంపీకి ఘన స్వాగతం పలికారు. పూజా కార్యక్రమం అనంతరం ఎంపీకి ఆశీర్వచనాలు అందజేశారు. ఎంతో మహిమాన్వితమైన మహదేవుడి ఆలయానికి ఈ ప్రాంతంలో విశిష్టస్థానం ఉందన్నారు. యువత చేపడుతున్న శివదీక్ష ఎంతో ప్రభావవంతమైందన్నారు. ఎంపీతో పాటు జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి కొల్కూరి రాజశేఖర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి, అమీన్‌పూర్ మండల పార్టీ అధ్యక్షుడు ఈర్లరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

శివరాత్రి ఉత్సవాల సందర్భంగా బీరంగూడా భ్రమరాంబ మల్లికార్జునస్వామి హుండీ లెక్కింపు పూర్తి చేశారు. శనివారం నిర్వహించిన హుండీ లెక్కింపు అనంతరం వివిధ ఆదాయ మార్గాల ద్వారా ఈ సంవత్సరం మొత్తం రూ.47,99,283 ఆదాయం సమకూరిందని ఆలయ చైర్మెన్ సుధాకర్‌యాదవ్, ఈవో శశిధర్ గుప్తా, ప్రత్యేక అధికారి అన్నపూర్ణ, జూనియర్ అసిస్టెంట్ మల్లికార్జున్‌రెడ్డిలు పేర్కొన్నారు. హుండీ ద్వారా రూ.6,18,694, టికెట్ల విక్రయం ద్వారా రూ.20,50,000, దుకాణాల టెండర్ల ద్వారా రూ.20,82,116 ఆదాయం వచ్చిందన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, తదితరులు

ఆదివాసీల హక్కుల కోసం పోరాడుదాం

పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్

సిద్దిపేట కలెక్టరేట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ఆదివాసీల హక్కుల కోసం ఐకమత్యంగా పోరాడుదామని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ పిలుపునిచ్చారు. దేశంలో ఆదివాసులపై జరుగుతున్న హత్యాకాండను నిరసిస్తూ సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రాగుల భూపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గిరిజనులు, ఆదివాసీలపై కక్ష కట్టి, రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను కాలరాస్తూ వారిని ఎన్‌కౌంటర్ల పేరుతో హత్య చేస్తోందని ఆరోపించారు. గిరిజన ప్రాంతాల్లోని అటవీ, భూగర్భ వనరులను దోచుకుని, కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ఆపరేషన్ కంగార్ పేరుతో ఊచకోత కోస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీల హక్కుల గురించి మాట్లాడే వారిని అర్బన్ నక్సలైట్లుగా ప్రచారం చేస్తుందని, ఇది మోదీ, అమిత్‌షా ప్రచారమన్నారు. ఈ సందర్భగా సిద్దిపేట జిల్లా ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక కమిటీని ప్రకటించారు. జిల్లా కో-ఆర్డినేటర్‌గా రాగుల భూపతి, జిల్లా కన్వీనర్లుగా సత్తయ్య, శ్రీకాంత్, బాబురావ్, మల్లారెడ్డి, దుర్గ రాములు, కేసరి ఎల్లం, కృష్ణ, నర్సింలు, ఆనంద్, భూపతి, జగన్‌లను నియమించారు.


కేసీఆర్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న నాయకులు

సుదర్శన చక్ర శిఖర ప్రతిష్ఠకు కేసీఆర్‌కు ఆహ్వానం

మర్కుక్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండలం పాములపర్తి గ్రామంలో శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో సుదర్శనచక్ర శికర ప్రతిష్ఠకు హాజరు కావాలని మాజీ సీఎం కేసీఆర్‌కు ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో శిఖర ప్రతిష్ఠ మహోత్సవం జరగనుందని మండల మాజీ ఎంపీపీ పాండు గౌడ్, నాచారం గుట్ట మాజీ చైర్మెన్ హరిపంతులు తెలిపారు. ఈ మేరకు వారు ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

రంగస్థల 'గిరి'రాజు

వందకుపైగా నాటక ప్రదర్శనలిచ్చిన టీచర్

- వెండితెర, బుల్లితెరలపై రాణిస్తున్న ఉత్తమ ఉపాధ్యాయుడు
- ఉత్తమ జ్యూరీ అవార్డుతో గుర్తింపు
- డాక్యుమెంటరీ, షార్ట్‌ఫిల్మ్‌లతో ప్రతిభ


ప్రత్యేక పాత్రలో గిరిబాబు..


నాటక ప్రదర్శనలో గిరిబాబు


ఏపీలో చలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకున్న గిరిబాబు(ఫైల్)

నంగునూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పాఠాలు చెప్పడమే కాదు.. రంగస్థలంపై రాణిస్తూ తనకంటూ ప్రత్యేకత చాటుకుంటున్నారు దేవులపల్లి గిరిబాబు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం సిద్ధన్నపేట గ్రామానికి చెందిన గిరిబాబు చిన్నప్పుడు ఊరిలో ప్రదర్శించే వీధి భాగవతాలు చూస్తూ నటన పట్ల ఆకర్షితుడయ్యాడు. సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పట్టభద్రుడు కాగా, ఉస్మానియా ఆర్ట్స్ కళాశాలలో ఎంఏ(జాగ్రఫీ), బీఈడీ పూర్తి చేశారు. బీఈడీ పూర్తి చేశాక నటన మీద ఆసక్తితో హైదరాబాద్‌లోని నిజాం కళాశాలలో థియేటర్ ఆర్ట్స్ కోర్సులో పీజీ చదివారు. నాటకాల్లో నటిస్తూనే డీఎస్సీకి ప్రిపేరై ఉపాధ్యాయ ఉద్యోగం సాధించారు.

వందకుపైగా నాటక ప్రదర్శనలు

ప్రభుత్వ ఉద్యోగం సాధించినా.. నటనపై మక్కువ పోలేదు. విధిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే సెలవు రోజుల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ తదితర రాష్ట్రాలలో ప్రభుత్వం నిర్వహించే నంది నాటకోత్సవాలు, సినీ రచయిత బుర్ర సాయిమాధవ్ నిర్వహించే తెనాలి కళల కాణాచి నాటక పరిషత్, ఎన్టీఆర్ నాటక పరిషత్, పరుచూరి రఘుబాబు నాటక పరిషత్, తెలంగాణ యువ నాటకోత్సవం, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖకు చెందిన 'తెర', గోవాడ క్రియేషన్స్‌తోపాటు వివిధ నాటక పరిషత్తులు నిర్వహించే నాటక ప్రదర్శనలలో పాల్గొన్నారు. రాజగృహప్రవేశం (అంబేద్కర్ జీవితచరిత్ర), యజ్ఞం (తెలంగాణ ఉద్యమ నేపథ్యం), ఆకాశ దేవర(దొంగ బాబాల నేపథ్యం), రచ్చబండ(తెలంగాణ గ్రామీణ జీవనం), ఇంటర్వ్యూ (తెలంగాణ సాగునీటి రంగ నిపుణు లు విద్యాసాగర్‌రావు జీవిత చరిత్ర), గాలి బతుకులు(వంశరాజు కులస్థుల చరిత్ర), బంగారు బిడ్డ(బట్టీ చదువుల నేపథ్యం), షాడో లెస్ మాన్ (మనిషి ప్రవర్తన), సావిత్రిబాయి పూలే (మొదటి మహిళా ఉపాధ్యాయురాలు) వంటి 25పైగా నాటకాలను వందకుపైగా ప్రదర్శనలు ఇచ్చారు. సుమారు 20 రేడియో నాటికల్లో ఆర్టిస్టుగా నటించి మెప్పించారు.


చీకటి పువ్వు నాటికతో మంచి గుర్తింపు

గతేడాది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన నంది నాటకోత్సవాలలో కరీంనగర్‌కు చెందిన చైతన్య కళాభారతి వారు ప్రదర్శించిన 'చీకటి పువ్వు' నాటికలో దేవులపల్లి గిరిబాబు ముఖ్యపాత్రలో నటించారు. ఈ నాటిక తృతీయ ఉత్తమ ప్రదర్శనగా ఎంపిక అయింది. ఈ నాటికలో సిద్ధు అనే పాత్రలో నటించి అలరించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో చీకటి పువ్వు నాటిక ప్రదర్శన తర్వాత అప్పటి తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సలహాదారు రమణాచారి నుంచి సన్మానం అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వివిధ నాటక పరిషత్తులు నిర్వహించిన నాటక పోటీలలో 15 ఉత్తమ జ్యూరీ అవార్డులను అందుకున్నారు. గత నెలలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన పోటీలలో రెండుసార్లు ఉత్తమ సహాయ నటుడు అవార్డును అనుకున్నారు. పోలుదాసు శ్రీనివాసరావు దర్శకత్వంలో ప్రదర్శించిన 'నిశి' నాటికలో 'ఆకాశ్' అనే పాత్రకు రెండుసార్లు ఉత్తమ జ్యూరీ అవార్డును అందుకున్నారు.

బుల్లితెర, వెండితెరపై రాణిస్తూ..

రంగస్థలంపై ప్రతిభను కనబరిచిన గిరిబాబు బుల్లితెర, వెండితెరపై సామాజిక చైతన్యం కలిగిన పాత్రల్లో నటిస్తున్నారు. వన్డే షార్ట్ ఫిలిం, ఒక తెలుగు ప్రేమ కథ, జ్యామెట్రీ బాక్స్, సీతా బాలకృష్ణ చిత్రాలలో నటించారు. సీతా బాలకృష్ణ చిత్రం ఓటీటీలో విడుదలైంది. బుల్లి తెరపై గీతా గోవిందం, గృహలక్ష్మీ సీరియల్స్‌లో నటించారు. ఇబ్రహీంనగర్ అనే గ్రామం పై నిర్మించిన డాక్యుమెంటరీలో, తాతా మనవరాలు అనే షార్ట్ ఫిల్మ్‌లో తన నటనతో ప్రతిభను చాటా రు. సామాజిక అంశాలపై వీడియోలు చిత్రీకరించి సామాజిక మాధ్యమాలలో అప్లోడ్ చేస్తున్నారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం గుండారం గ్రామ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నపుడు గత సాధారణ ఎన్నికలకు ముందు ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ(ఎస్సీఈఆర్టీ) సంచాలకుడు గాజర్ల రమేశ్ రచించిన 'ఓడిపోనీయకు మీ ఓటును' అనే పాట అక్కడి విద్యార్థులతో కలిసి నృత్య ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు.

పేద విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తా..



పేద విద్యార్థులకు చదువుతోపాటు సామాజిక బాధ్యతను నేర్పిస్తూ వారి ఉన్నతికి పాటు పడుతున్నా. భవిష్యత్తులో పేద విద్యార్థుల అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తా. వారి అభ్యున్నతికి కృషి చేయడం ఉపాధ్యాయుడిగా నాకు దొరికిన అదృష్టంగా భావిస్తున్నాను.

- దేవులపల్లి గిరిబాబు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

ఆటపాటలతో పాఠాలు..

దేవులపల్లి గిరిబాబు పాఠాలను ఆట, పాటల ద్వారా బోధిస్తూ ఆకట్టుకుంటున్నాడు. తరగతి గదిలో వినూత్న రీతిలో పాఠాలు బోధిస్తూ 2024లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. పాఠశాల విద్యార్థుల హాజరుశాతం పెంచడం కోసం శత శాతం హాజరైన విద్యార్థులకు, ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, నోటు బుక్‌లను అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు.

వసతికి సుస్తీ

● సమస్యల వలయంలో గజ్వేల్ ఎస్టీ హాస్టల్

● డోర్లు లేని మరుగుదొడ్లు, పాడైనఫ్యాన్లు, లైట్లు, తాగునీటికీ తండ్లాటే..

● పెచ్చులూడుతున్న భవనం

గజ్వేల్ రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు విద్యతో పాటు వసతి, ఆహారం అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలు సమస్యలకు నిలయాలుగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తుంది. వసతి గృహాల్లో పరిస్థితులు మెరుగు పడకపోగా పాలకుల చిన్నచూపు కారణంగా మరింత దిగజారుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు కొత్తగా సంక్షేమ వసతి గృహాలు మంజూరు చేశామని గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ వాటిలో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గజ్వేల్ పట్టణంలోని ఎస్టీ భవనం శిథిలావస్థకు చేరుకున్నది. విద్యార్థులు వసతి గృహంలో తాగునీరు లేక మిషన్‌భగీరథ నీళ్లతోనే కాలం వెళ్లదీస్తున్నారు. భవనం స్లాబ్ పెచ్చులూడడం, వర్షానికి ఊరుస్తుండడంతో ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీస వసతులు లేక బిక్కుబిక్కుమంటున్నారు. బెడ్లు లేక నేలపైనే పడుకోవాల్సి దుస్థితి నెలకొన్నది. గదుల్లో ఫ్యాన్‌లు, సరిపడా లైట్లు కూడా లేవు. వసతిగృహానికి చుట్టూ ప్రహరీ లేక విషపురుగులు సంచరించే ప్రమాదమూ ఉన్నది. వసతి గృహంలో బాత్రూములకు డోర్లు లేక విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అస్తవ్యస్త డ్రైనేజీతో మురుగునీరు నిల్వ ఉండి దోమలు, కీటకాలు, ఈగలు విజృంభిస్తున్నాయి. దీంతో విద్యార్థులు వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. ఇన్ని సమస్యలున్నా అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంపై విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.






గజ్వేల్‌లో గిరిజనుల వసతిగృహం

సమస్యలను పరిష్కరించాలి



సవతి గృహంలో సమస్యలతో కొంతకాలంగా ఇబ్బందులు పడుతున్నాం. మరుగుదొడ్లకు డోర్లు లేక చిన్నారులు అవస్థలు పడుతున్నారు. స్లాబ్ పెచ్చులూడడంతో విద్యార్థులు బయభ్రాంతులకు గుర వుతున్నారు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలి.

- హాస్టల్ వార్డెన్ మహ్మద్ నదీమ్

హరీశ్‌రావుపై అక్రమ కేసులు సరికాదు

● రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు దేవీ రవీందర్

గజ్వేల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి) : హరీశ్‌రావుపై అక్రమ కేసులు సరికాదని రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు దేవీ రవిందర్ అన్నారు. గజ్వేల్ పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బ్రోకర్ రాజకీయాలకు పేరు గడించిన కాంగ్రెస్ నేతగా చెప్పుకుంటున్న చక్రధర్‌గౌడ్‌తో అక్రమ కేసులు పెట్టిస్తుంది కాంగ్రెస్ నాయకులేనన్నారు. ప్రజల పక్షాన పోరాడుతున్న హరీశ్‌రావుపై అక్రమ కేసులు పెడుతూ కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోవడంతో ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని, ఇది తట్టుకోలేక డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. ఇకనైనా హామీల అమలుపై దృష్టి పెట్టాలని, లేనిపక్షంలో ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు పాల రమేశ్‌గౌడ్, నిజామోద్దీన్ తదితరులున్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తాం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కరాములు


మాట్లాడుతున్న చుక్కా రాములు

సిద్దిపేట అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. శనివారం పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బీజేపీ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తులతో ప్రజల ముందుకు వెళ్తామన్నారు. ఏప్రిల్ మొదటి వారంలో తమిళనాడు రాష్ట్రంలోని మధురైలో జరుగుతున్న సీపీఎం 24వ జాతీయ మహాసభల్లో దేశంలో ప్రత్యామ్నాయ విధానాలను శాస్త్రీయ పద్ధతిలో రూపొందించి ప్రజల్ని ఐక్యపరిచి ప్రజా ఉద్యమాలను నిర్మిస్తామన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, గోపాలస్వామి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్, సందబోయిన ఎల్లయ్య శెట్టిపల్లి సత్తిరెడ్డి గొడ్డుబర్ల భాస్కర్ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాణ్యమైన బోధన అందించాలి : డీఈవో


ప్రదర్శనను పరిశీలిస్తున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

చేర్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. చేర్యాల పట్టణంలోని బాలుర జడ్పీఎస్ఎస్‌లో శనివారం మండలస్థాయి టీచర్ లెర్నింగ్ మెటీరియల్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు సైన్స్, గణితం, ఆంగ్లం, ఎన్విరాన్‌మెంట్ సైన్స్‌పై రూపొందించిన పలు ప్రయోగాలు, పాఠ్యాంశాలను ప్రదర్శించారు. అనంతరం ఉత్తమ ఎగ్జిబిట్లు ప్రదర్శించిన పాఠశాలల ఉపాధ్యాయులకు డీఈవో ప్రశంసాపత్రం అందించి అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో రచ్చ కిష్టయ్య, సెక్టోరియల్ ఆఫీసర్లు నర్సింహులు, రామస్వామి, రంగనాథ్, భాస్కర్ పాల్గొన్నారు.

తహసీల్దార్ చొరవతో బడికి రోడ్డు సౌకర్యం

ధూళిమిట్ట, మార్చి 1(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెడ్యానాయక్ తండా ఉన్నత పాఠశాలకు రోడ్డు సౌకర్యం సరిగా లేకపోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గ్రహించిన మండల తహసీల్దార్ మధుసూదన్ ప్రత్యేక చొరవ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు పాఠశాలకు భూమిని విరాళంగా అందించిన వారి వారసులు, చుట్టుపక్కల గ్రామస్థులతో మాట్లాడి శనివారం రోడ్డు నిర్మాణానికి ముగ్గు పోయించారు. దీంతో 20 ఏళ్ల సమస్యకు పరిష్కారం లభించనట్లయింది. తహసీల్దార్‌కు పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రవీందర్, ప్రధానోపాధ్యాయుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు

తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసరావు


శ్రీనివాసరావు

తొగుట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా మల్లన్నసాగర్ డీఈ చెన్ను శ్రీనివాసరావు శనివారం నియామకయ్యారు. గెజిటెడ్ అధికారుల సంఘం సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో జిల్లా కార్యదర్శిగా జయశ్రీ, ఉపాధ్యక్షుడిగా అయోధ్యరెడ్డి, కార్యాలయ కార్యదర్శిగా సతీష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం అధికారులు నూతన అధ్యక్షుడికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీరాంరెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రామారావు, ఖమ్మం జిల్లా ప్రతినిధి సంజయ్, సిద్దిపేట జిల్లా నాన్‌గెజిటెడ్ అధ్యక్ష, కార్యదర్శులు గ్యాదరి పరమేశ్, కోమండ్ల విక్రంరెడ్డి పాల్గొన్నారు.

'ప్లాస్టిక్‌ను వినియోగించవద్దు'

గజ్వేల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌ను ప్రజలు వినియోగించవద్దని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నర్సయ్య సూచించారు. పట్టణంలోని చేపడుతున్న పారిశుధ్య పనులను శనివారం ఆయన పరిశీలించారు. దుకాణ యజమానులు, పట్టణ ప్రజలు ప్లాస్టిక్ కవర్లకు బదులుగా జ్యూట్ బ్యాగులను వాడాలలని సూచించారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త బండికి ఇవ్వాలన్నారు.

ప్రమాద బీమా చెక్కుల అందజేత

గజ్వేల్ రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణానికి చెందిన పానుగంటి శ్రీకాంత్ ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులకు శనివారం రెండు లక్షల విలువగల ప్రమాదబీమా చెక్కును అందజేసినట్లు ఇండియన్ బ్యాంక్ మేనేజర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. మృతుడికి ఇండియన్ బ్యాంక్ గజ్వేల్ బ్రాంచ్‌లో అకౌంట్ ఉండగా, గతంలో ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా తీసుకున్నట్లు తెలిపారు.

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

● ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్

చిన్నకోడూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : విధులు క్రమశిక్షణతో నిర్వర్తించాలని ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్ సూచించారు. చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు శివారులోని సీఏఆర్ హెడ్ క్వార్టర్‌లో శనివారం జిల్లాలోని సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్, సిబ్బందికి వీక్లీ పరేడ్ నిర్వహించారు. ఆర్మ్స్ స్క్వాడ్ డ్రిల్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఫిట్‌నెస్‌ను అనునిత్యం కాపాడుకోవాలని, పోలీసులు మంచి జీవన విధానాన్ని అవలంబించాలని సూచించారు. కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ మధు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు పెరేడ్ కమాండర్ కార్తీక్, పూర్ణ చందర్, ధరణి కుమార్, రాజేష్, విష్ణు ప్రసాద్, ఇన్స్పెక్టర్‌లు వాసుదేవరావు, ఉపేందర్, విద్యాసాగర్, ప్రవీణ్ కుమార్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సిద్దిపేట రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట రూరల్ ఎస్ఐ అపూర్వరెడ్డి ప్రజలకు సూచించారు. శుక్రవారం రాత్రి సిద్దిపేట రూరల్ మండలం చింతమడక గ్రామంలో పోలీసు కళాబృందం చే కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఫోన్ చేసి బ్యాంకు అధికారులమని ఆధార్, పిన్ నెంబర్ వంటి వివరాలు అడిగితే చెప్పవద్దన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు వాడినా, విక్రయించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలన్నారు.

పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి


ఆయా వర్గాల నాయకులతో సీఐలు, కమిషనర్

గజ్వేల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని గజ్వేల్ సీఐలు సైదా, మురళీ సూచించారు. గజ్వేల్ పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని శనివారం పీస్ కమిటీ సమావేశాన్ని మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నర్సయ్య, విద్యుత్ శాఖ ఏఈ గంధం మారుతిలతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ చిన్న చిన్న విషయాలకు గొడవలకు దిగవద్దన్నారు. రోడ్లపై అనేక రకాల పండ్లు, ఇతర వస్తువులు విక్రయించే అవకాశం ఉన్నందున ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సమస్యలు లేకుండా చూస్తామని విద్యుత్ శాఖ ఏఈ మారుతి తెలుపగా, తడి, పొడి చెత్తను వేరుచేసి చెత్త బండికి ఇవ్వాలని మునిసిపల్ కమిషనర్ నర్సయ్య సూచించారు. కార్యక్రమంలో టీఎంసీ చైర్మన్ సయ్యద్ మతీన్, ఇతర వర్గాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

సీసీరోడ్లకు రూ.2.50కోట్లు

● ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, ధూళిమిట్ట మండలాలలోని పలు గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఉపాధిహామీ ద్వారా రూ.2.50 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొద్దిరోజులక్రితం తాను అందించిన ప్రతిపాదనలు పరిశీలించిన ప్రభుత్వం ఆమోదించిందని తెలిపారు. చేర్యాల మండలానికి రూ.80లక్షలు, కొమురవెల్లి రూ.70లక్షలు, మద్దూరు రూ.50లక్షలు, ధూళిమిట్ట రూ.50లక్షలు చొప్పున మంజూరయ్యాయని తెలిపారు. భూగర్భజలాలు అడుగంటి పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో గోదావరి జలాలు వెంటనే అందించాలని ప్రభుత్వాన్ని కోరినట్లు పేర్కొన్నారు.

రైతుపై ఫర్టిలైజర్ యజమాని దాడి

దౌల్తాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రైతు యూరియా కోసం ఫర్టిలైజర్ దుకాణం వద్దకు వెళితే యూరియా లేదని రైతుపై దాడి చేసిన సంఘటన దౌల్తాబాద్ మండల కేంద్రంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధిత రైతు జోడు అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. దౌల్తాబాద్ మండల పరిధిలోని షేర్‌పల్లి గ్రామానికి చెందిన జోడు అశోక్ వరి పంటకు యూరియా కోసం దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణానికి వెళ్లాడు. దీంతో ఫర్టిలైజర్ యజమాని యూరియా లేదని తెలిపాడు. రైతు ఎదుటే మిగతా రైతులకు యూరియా ఇస్తుండడం చూసిన అశోక్ తనకూ ఇవ్వాలని కోరాడు. దీంతో నీకెందుకు ఇస్తాం.. నువ్వు రెగ్యులర్ కస్టమర్‌వా అంటూ అసభ్యకరంగా మాట్లాడుతూ మరొకరితో కలిసి యజమాని దాడి చేశారు. దాడి చేసినవారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని బాధిత రైతు డిమాండ్ చేశారు.

ఫీజు కట్టలేదని ఎండలో నిలబెట్టిన యాజమాన్యం

కొండపాక, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కొండపాకలోని ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం స్కూల్ ఫీజు కట్టని కొందరు విద్యార్థులను శనివారం స్కూల్ గ్రౌండ్‌లో ఎండలో నిలబెట్టింది. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు స్కూల్‌కు చేరుకుని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. విద్యార్థులను బయట నిలబెట్టడం వల్లన మానసిక స్థైర్యాన్ని కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు చేతికందగానే కడతామని తల్లిదండ్రులు యాజమాన్యానికి తెలపడంతో సమస్య సద్దుమణిగింది.

దళారులకు విక్రయించి నష్టపోవద్దు

● కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ హరికృష్ణరెడ్డి

తొగుట, మార్చి 1(ఆంధ్రజ్యోతి) రైతులు పొద్దుతిరుగుడు గింజలను దళారులకు విక్రయించి నష్టపోవద్దని, త్వరలో తొగుటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ హరికృష్ణరెడ్డి సూచించారు. శనివారం సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల అభ్యున్నతి కోసమే తాము పాటుపడుతున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. దానికి వారు సానుకూలంగా స్పందించి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడానికి ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. గింజలను రైతులు కొనుగోలు కేంద్రంలో విక్రయించి లబ్ధిపొందాలన్నారు. అధికారులు కొనుగోలు కేంద్రం ప్రారంభించకుండా జాప్యం చేస్తే రైతుల పక్షాన ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుర్మయాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా పథకం అమలు చేయాలి

● రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు రామలింగారెడ్డి



సిద్దిపేట కలెక్టరేట్ మార్చి 1(ఆంధ్రజ్యోతి) : పంట నష్టం సమయంలో రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం అందించేందుకు పంటల బీమా పథకం అమలు చేయాలని తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మారెడ్డి రామలింగారెడ్డి అన్నారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంటల బీమాతో రైతు ప్రభుత్వ దయదాక్షిన్యాల పైన ఆధారపడాల్సిన అవసరం ఉండదన్నారు. రుణమాఫీ పూర్తిగా కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, దేవేందర్‌రెడ్డి, లక్ష్మయ్య, యాదంరావు, సంతోష్‌రెడ్డి, భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రఘు మిడియామిని విడుదల చేయాలని డిమాండ్

సిద్దిపేట కలెక్టరేట్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): అక్రమంగా అరెస్టు చేసిన మూలవాసి బచావో మంచ్ నేత రఘు మిడియామిని వెంటనే విడుదల చేయాలని సీఎల్‌సీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ రావు, ఉమ్మడి జిల్లా కన్వీనర్ భూపతి డిమాండ్ చేశారు. శనివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ వివాహిత మృతి

మద్దూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన కొండూరి స్వప్న(30)కు అదే గ్రామానికి చెందిన కొండూరి కనకయ్యతో రెండేళ్ల క్రితం వివాహమైంది. వీరికి సంతానం కలుకపోవడంతో పాటు స్వపన్న ఆరోగ్య బాగాలేకపోవడంతో గతనెల 23న ఇంట్లో ఎవరూ లేని సమయంతో క్రిమిసంహారక మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వంటిమామిడిలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఒకరికి తీవ్ర గాయాలు

గజ్వేల్ రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన గజ్వేల్ మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అహ్మదీపూర్ గ్రామానికి చెందిన మంద యాదయ్య(60) గజ్వేల్ పట్టణంలోని ఆర్ అండ్‌ఆర్ కాలనీ పల్లెపహడ్ గ్రామానికి చెట్ల మందు తాగడానికి స్కూటీపై వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. మార్గమధ్యంలో అహ్మదీపూర్ చౌరస్తా వద్ద కొల్గూరు నుంచి బైక్‌పై వస్తున్న వ్యక్తి అతివేగంగా స్కూటీని ఢీకొట్టగా యాదయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

గజ్వేల్ రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చోరీ చేసి 4 తులాల బంగారం ఎత్తుకెళ్లిన ఘటన గజ్వేల్ పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గజ్వేల్ పట్టణానికి చెందిన బక్కన్నగారి ఎల్లారెడ్డి స్నేహితుడి కూతురు పెళ్లికి వెళ్లి వచ్చి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో ఉన్న బంగారాన్ని ఎత్తుకెళ్లినట్లు తెలిసింది.

గంజాయి విక్రేతల అరెస్టు

చేర్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ముగ్గురు గంజాయి విక్రేతలను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. చేర్యాల సర్కిల్ పీఎస్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ఎల్.శ్రీను వివరాలను వెల్లడించారు. చేర్యాల పట్టణంలోని మంగలిగడ్డ ప్రాంతానికి చెందిన నీలం చందు, జనగామ జిల్లా బచ్చన్నపేట మండల కేంద్రానికి చెందిన ఏనుగుల బాబు, మహంకాళి రాజేశ్ హైదరాబాదులో చుదువా సంచార వ్యాపారం చేసే క్రమంలో ఒకరికొక్కరు పరిచమయ్యారు. కొంతకాలంగా గంజాయి సేవనంతోపాటు విక్రయిస్తున్నారు. శనివారం స్థానిక వ్యవసాయమార్కెట్‌యార్డు వెనకభాగంలో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దాడులు చేపట్టి వారి నుండి 198 గ్రాముల గంజాయిని, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ ధూల్‌పేటలో గుర్తు తెలియని వ్యక్తి నుంచి కొనుగోలు చేసినట్లు నిందితులు చెప్పారు.

కాపర్‌వైర్ చోరీ

చేర్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం చిట్యాల గ్రామశివారులోని పలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు శుక్రవారం రాత్రి ధ్వంసం చేసి కాపర్ వైర్‌ను దొంగిలించారు. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమాచారం అందుకున్న విద్యుత్, పోలీసు అధికారులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

అడుగంటుతున్న ఆశలు

5వ పేజీ తరువాయి

నేపథ్యంలో శనివారం రోజున ఫోన్ ద్వారా మరోసారి కోరారు. వెంటనే రంగనాయకసాగర్‌లోకి నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఎత్తిపోతల వైపు రైతుల చూపు

రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.5 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. గతేడాది ఇదే సమయంలో 3 టీఎంసీల సామర్థ్యంతో నిండుగా ఉంది. మళ్లీ చివరి దశలో మరొక్కసారి నీటి విడుదల జరగడంతో పంటలు చేతికొచ్చాయి. అయితే ప్రస్తుతం ఉన్న నీటితో కాలువల్లోకి విడుదల చేసే పరిస్థితి లేదు. ఒకవేళ రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మిడ్‌మానేరు నుంచి గోదావరి జలాలను ఎత్తిపోస్తేనే ఈ పరిస్థితిని అధిగమించే అవకాశం ఉంది. లేదంటే దాదాపు 50వేల ఎకరాల సాగు ప్రశ్నార్థకమవుతుంది. రంగనాయకసాగర్‌లోకి ఒక టీఎంసీ నీటిని ఇప్పటికిప్పుడు విడుదల చేయాల్సిన అవసరం ఉంది. ఎస్సారెస్పీ ద్వారా నీటిని విడుదల చేయాలని రైతులు సైతం కోరుతున్నారు.

మూడెకరాల పొలం ఎండుతుంది



నాలుగు ఎకరాల్లో వరిపంట సాగుచేస్తే మూడు ఎకరాలు నీళ్లు అందక ఎండిపోతున్నది. ఇప్పటికే పెట్టుబడికి 50 వేల రూపాయలు దాటింది. మా బాధలు పట్టించుకునేవాళ్లు లేరు. అప్పట్లో టైముకు నీళ్లు ఇచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

- మల్లయ్య, రైతు, సీతారాంపల్లి

నీళ్లు విడుదల చేయాలి



కాళేశ్వరం నీళ్లు రాక ఎండిపోతున్నాయి. చెరువు కిందనే పొలాలు ఉన్నప్పటికీ కండ్ల ముందే ఎండిపోతున్నాయి. అధికారులను అడిగినా పట్టించుకోవడం లేదు. ఉన్న ఎకరం పొలం కూడా ఎండిపోతున్నది. రెండు బోర్లు వేసినా నీళ్లు రాలేదు. నాలుగు రోజుల్లో నీళ్లు రాకుంటే చాలామంది పొలాలు ఎండిపోతాయి.

- పడిగె సంతోష్, రైతు

రైతుల భగీరథ యత్నం.. దిక్కుతోచక పశుగ్రాసానికి..

5వ పేజీ తరువాయి

పరిస్థితుల దృష్ట్యా పంటలు ఎండిపోతున్నాయి. గురువన్నపేట గ్రామానికి చెందిన పుట్ట వెంకటేశ్ తనకున్న మూడు ఎకరాలలో వరి సాగు చేయగా, బోరు ఉన్నా నీరు సరిపోకపోవడంతో వారం రోజులుగా రోజుకు 5-8 ట్యాంకర్ల నీటిని కొనుగోలు చేస్తు పంటను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నాడు. బోర్లు పనిచేయక, కొత్తగా బోర్లు వేసుకునేందుకో లేదా ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేయడానికి ఆర్థిక స్థోమత లేని రైతులు దిగాలు చెందుతున్నారు. చేలను వదిలి పెట్టేసి పశువులను మేపుతున్నారు. చేర్యాల మండల కేంద్రానికి చెందిన కాత అంజనేయులు ఎకరం భూమిలో వరి వేయగా, పశువుల మేత కోసం కొంత స్థలంలో సొప్ప పెట్టాడు. ఉన్న ఒక్కబోరు నుండి నీరు రాక సొప్పకు కూడా సరిపడకపోవడంతో పొలంలో పశువులు మేపుతున్నాడు. చేర్యాల, కొమురవెల్లి మండలాలలోని ఇతర గ్రామాల్లోనూ ఇదే పరిస్థితులు నెలకొన్నాయి. రానున్న రోజుల్లో ఎండలు విపరీతమై మరింత దయనీయ పరిస్థితి నెలకొన్న క్రమంలో ఎండిన పంటలకు పరిహారం అందించాలని వేడుకుంటున్నారు. పంటలను కాపాడుకునేదుకు దేవాదుల సాగునీటి అందించాలని కోరుతున్నారు.


చేర్యాలలో నెర్రెలు వారిన వరి చేను

ఎస్సీ వర్గీకరణ ఉద్యమ అమరులకు నివాళి

న్యూస్ నెట్‌వర్క్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ, సామాజిక న్యాయం కోసం జరిగిన ఉద్యమాల్లో అలుపెరగని పోరు చేసి అసువులు బాసిన అమరుల త్యాగాలు మరువలేనివని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి బింగి పవన్‌కల్యాణ్ అన్నారు. శుక్రవారం నారాయణరావుపేట మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఉద్యమ అమరవీరులకు నివాళులర్పించారు. గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అమరవీరుల చిత్రపటాలకు ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు మైస రాములు, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి ఉబ్బని ఆంజనేయులు నివాళులర్పించారు. ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేసి అమరులైన వారి చిత్రపటాలకు ఎమ్మార్పీఎస్ ములుగు మండల అధ్యక్షుడు ఆదాను మహేష్ ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షుడు మహేష్ నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ రాయపోల్ మండల అధ్యక్షుడు రవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుర్ర నర్సింహులు, మాజీ సర్పంచ్ రామొళ్ల స్వామి, నాయకులు పాల్గొని నివాళులర్పించారు. ధూళిమిట్ట మండలకేంద్రంలో అమరులకు ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు సుందరగిరి భాస్కర్, మండల అధ్యక్షుడు నల్ల రాజేష్ తదితరులు నివాళులర్పించారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో నాయకులు చిన్నరాజుగారి కిషన్, నర్సింహులు, మల్కి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. చేర్యాల పట్టణంలోని అంగడి బజారు చౌరస్తాలో అమరుల ఫ్లెక్సీకి ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మల్లిగారి యాదయ్య, నాయకులు నివాళులర్పించారు. నంగునూరులో అమరుల చిత్రపటాలకు ఎంఎస్పీ మండల శాఖ అధ్యక్షుడు దేవులపల్లి బాలరాజు మాదిగ నాయకులతో నివాళులర్పించారు. హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో అమరవీరులకు ఎమ్మార్పీఎస్ నాయకులు నివాళులర్పించారు.


సిద్దిపేట రూరల్ : నారాయణరావుపేటలో అమరవీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు